ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్ జిల్లాల వార్తలు
5
సోమవారం 14 అక్టోబరు 2024



స్నానానికి వెళ్లి వ్యక్తి మృతి
- సింగూరు ప్రాజెక్టు వద్ద విషాదం
- మూడురోజుల తర్వాత మృతదేహం లభ్యం

7

అదృశ్యమై.. శవమై తేలి..
- నర్సాపూర్ పట్టణంలో ఘటన



ఏడుపాయలలో వనదుర్గామాత పల్లకీ ఊరేగింపు

ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

పాపన్నపేట, అక్టోబరు 13 : తొమ్మిది రోజులు జరిగిన శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. శనివారం విజయదశమి పూజలు నిర్వహించగా... ఆదివారం అంగరంగవైభవంగా శోభాయాత్రగా అమ్మవారి నిమజ్జనోత్సవాలు చేపట్టారు. నవరాత్రుల చివరి రోజు శనివారం ఏడుపాయలలో వనదుర్గామాత రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గోకుల్‌షెడ్డులో ప్రతిష్ఠించిన అమ్మవారిని ఆదివారం వేద బ్రాహ్మణులు ప్రత్యేక పూజల అనంతరం పల్లకిలో ఊరేగింపుగా మంజీర నదిలో నిమజ్జనం చేశారు. దసరా వేడుకలు, ఆదివారం కలిసి రావడంతో ఏడుపాయల జనసంద్రంగా మారింది. పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో సత్రాలు దొరక్క చెట్ల కింద టెంట్లు వేసుకొని విందులు చేసుకున్నారు.

దసరా సంబరాల్లో జగ్గారెడ్డి జోష్

- సొంత ఖర్చులతో వేడుకల నిర్వహణ
- పాటలు పాడి ఉత్సాహం నింపిన మాజీ ఎమ్మెల్యే
- పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, కూతురు జయారెడ్డి, కుమారుడు దత్తుసాయిరెడ్డి



అంబేడ్కర్ స్టేడియంలో పాలపిట్టలను ఎగురవేస్తున్న జగ్గారెడ్డి, నిర్మలారెడ్డి, జయారెడ్డి, దత్తుసాయిరెడ్డి




జనసంద్రంగా మారిన సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియం

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 13 : టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి సొంత ఖర్చులతో సంగారెడ్డిలో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ స్టేడియంలో భారీ జనసందోహం నడుమ రావణాసుర దహనం చేశారు. వేడుకలు వీక్షించేందుకు సంగారెడ్డి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు తరలివచ్చారు. అంతకుముందు రామ్‌మందిర్ ఆలయ కమిటీ, రామ్ మందిర్ యువసేన ఆధ్వర్యంలో రామమందిర్ నుంచి గరుత్మంత వాహనంపై రామ, లక్ష్మణ, సీతాదేవీ ఉత్సవమూర్తులను జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఊరేగింపుగా స్టేడియంకు తీసుకొచ్చారు. శోభాయాత్రలో భజనపాటలు ఆలపిస్తూ జగ్గారెడ్డి ఉత్సాహం నింపారు. అడుగడుగున బాణాసంచా కాల్చారు. వేదిక వద్ద మహేశ్వరశర్మ సిద్ధాంతితో కలిసి జమ్మి వృక్షానికి పూజ చేశారు. అనంతరం టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, కూతురు జయారెడ్డి, కొడుకు దత్తుసాయిరెడ్డి పాలపిట్టలను జనాలకు చూపించి ఆకాశంలోకి వదిలారు. వేడుకల్లో సంగీత విభావరి అలరించింది. ప్రముఖ సంగీత గాయకులు వందేమాతరం శ్రీనివాస్, గాయని సునీత, శ్రీకృష్ణ, సాయివేద వాగ్దేవీ పాడిన భక్తి, సినిమా పాటలు ప్రజలను ఉర్రూతలూగించాయి. జగ్గారెడ్డి స్వయంగా భక్తి పాటలు పాడి ప్రజల్లో జోష్ నింపారు. దసరా సందర్భంగా జై భవానీ యూత్ అసోసియేషన్ (మీది బజార్) ఆధ్వర్యంలో కాల్చిన బాణాసంచా కనువిందు చేసింది. అనంతరం ప్రజలు, కార్యకర్తల కరతాల ధ్వనుల నడుమ జగ్గారెడ్డి సమక్షంలో రావణాసురుడి ప్రతిమను దహనం చేశారు. పరస్పరం అలయ్‌బలయ్ తీసుకుంటూ విజయదశమి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి తోపాజి అనంతకిషన్, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మీరవి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ముకరాల శ్రీకాంత్‌గౌడ్, కిరణ్‌గౌడ్, కౌన్సిలర్లు వనితసంతోష్, వెంకటపతిరాజు, కాంగ్రెస్ నాయకులు, కళాకారులు పాల్గొన్నారు.



మెదక్ పట్టణంలో రావణ దహనం.. కార్యక్రమాన్ని తిలకించేందుకు తరలివచ్చిన ప్రజలు



ఊరూవాడా వేడుక

సంబరంగా విజయదశమి

మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో దసరా వేడుకలు శనివారం వైభవంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే ఆలయాలకు తరలివచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్ధరాత్రి వరకు భక్తుల తాకిడి కొనసాగింది. వాణిజ్య సముదాయాలు, వాహనాలు, యంత్రసామగ్రి, వృత్తి పరికరాలకు ఆయుధ పూజలు నిర్వహించారు. శరన్నవరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన మండపాల్లో హోమాలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం గ్రామ పొలిమేరల్లో జమ్మిచెట్టుకు పూజలు నిర్వహించి, పాలపిట్టను చూసి, పరస్పరం శమీ ఆకును పంచుకుని అలాయ్‌బలాయ్ తీసుకున్నారు. మెదక్ జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల మైదానంలో మెదక్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రావణదహనం, దసరా వేడుకల్లో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు తదితరులు పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లాకేంద్రంతో పాటు గ్రామాల్లో నిర్వహించిన వేడుకల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

-మెదక్ అర్బన్/సంగారెడ్డి నెట్‌వర్క్



కోహీర్‌లో శమీ పూజ

దసరా జోరు..

సంబరాల్లో జనం.. జోరుగా మద్యం, మాంసం విక్రయాలు

రూ.13.43 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు



మెదక్‌లో వైన్‌షాపు వద్ద మద్యం కొనుగోలు చేస్తున్న జనం

మెదక్, అక్టోబరు 13: తెలంగాణ ప్రజలకు పెద్ద పండుగ దసరా... ఉద్యోగ, వ్యాపారాల కోసం.. ఉపాధి వెతుక్కుంటూ ఎక్కడెక్కడికో వెళ్లి స్థిరపడిన వారు దసరా వచ్చిందంటే తప్పనిసరిగా సొంతూరికి చేరుకుంటారు. పండుగకు నెల రోజుల ముందు నుంచే ఏర్పాట్లు చేసుకుంటారు.

దసరా పండగ చుక్క, ముక్క లేనిదే పూర్తవదు. గ్రామాల్లో రెండ్రోజులు మద్యం ఏరులై పారుతుంది. పండగ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈసారి వైన్‌షాపుల నిర్వాహకులు ముందుగానే అధిక మొత్తంలో సరుకును డిపోల నుంచి తెప్పించుకుని గోదాంలలో నిల్వ చేసుకున్నారు. ఊహించినట్టే పండగ రోజు మద్యం విక్రయాలు విపరీతంగా పెరిగాయి. సాధారణ రోజులతో పోలిస్తే గత రెండు రోజుల్లో అమ్మకాలు 10 శాతం పెరిగాయి. ఈ నెల 11, 12 తేదీల్లో రికార్డు స్థాయిలో రూ.13.43 కోట్లు విలువైన మద్యాన్ని మెదక్ జిల్లా కొల్చారం మండలం చిన్నఘనపూర్‌లోని ఐఎంఎల్ డిపో నుంచి వైన్‌షాపులకు తరలించారు. మద్యప్రియులకు ఎలాంటి లోటురాకుండా ఎక్సైజ్‌శాఖ కూడా వైన్స్, బార్లకు టార్గెట్లు విధించి మరీ స్టాకు సరఫరా చేసింది.

మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో..

మెదక్ జిల్లాలో 89 వైన్స్‌లు, సంగారెడ్డి జిల్లాలో 109 మద్యం దుకాణాలు ఉన్నాయి. రెండు జిల్లాల్లో 16 బార్లు ఉన్నాయి. వీటన్నింటికీ చిన్న ఘనపూర్‌లోని ఐఎంఎల్ డిపో నుంచి మద్యం సరఫరా జరుగుతుంది. ఈ మద్యం దుకాణాల నిర్వాహకులే గ్రామీణ ప్రాంతాల్లోని బెల్టు షాపులకు మద్యం సరఫరా చేసి విక్రయాలు పెరిగేలా చర్యలు చేపడుతున్నారు. విజయదశమి పండగ శనివారం రావడంతో చాలామంది పండగ సంబరాలను ఆదివారం చేసుకున్నారు. దీంతో రెండోరోజు విక్రయాలు మరింత పెరిగాయి.

మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో మద్యం అమ్మకాల లెక్క

10వ తేదీ : మొత్తం మద్యం అమ్మకాలు రూ.4.06 కోట్లు

• ఐఎంఎల్ కేసులు	4,527	(రూ. 3.15 కోట్లు)
• బీర్ కేసులు	5,482	(రూ. 91 లక్షలు)

11వ తేదీ : మొత్తం మద్యం అమ్మకాలు రూ.9.37 కోట్లు

• ఐఎంఎల్ కేసులు	9,527	(రూ. 6.87 కోట్లు)
• బీర్ కేసుల	1,768	(రూ. 2.50 కోట్లు)

మాంసం అమ్మకాలు జోరుగా..

దసరా శనివారం రావడంతో అనేక కుటుంబాలు సంబరాలను ఆదివారం జరుపుకున్నాయి. రెండు రోజుల్లో సుమారు రూ. 8 కోట్ల విలువైన మేక, గొర్రె, కోడి మాంసాన్ని ఆరగించారు. మెదక్, టేక్మాల్, మేకల సంతలో భారీగా జీవాల విక్రయాలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 80 నుంచి లక్ష కిలోల మాంసం అమ్ముడైనట్లుగా విక్రయదారులు చెబుతున్నారు. అదే విధంగా చికెన్ అమ్మకాలు భారీగా జరిగాయి. మెదక్, రామాయంపేట, నర్సాపూర్, తూప్రాన్, లతో పాటు అన్ని మండల కేంద్రాలు, మేజర్ గ్రామ పంచాయితీలలో చికెన్ విక్రయాలు జరిగాయి. మెదక్ మార్కెట్‌లో నాటుకోళ్ల 2 వేలకు పైగా అమ్మినట్లు తెలుస్తోంది.

నవరాత్రుల్లో ముక్కా, చుక్కా బంద్

శ్రీదేవి శరన్నవరాత్రుల సందర్భంగా జిల్లా కేంద్రమైన మెదక్‌తో పాటు పల్లె పల్లెనా దుర్గాదేవి ప్రతిమలను నెలకొల్పి ప్రత్యేక పూజలు ఆచరించారు. ఈ తొమ్మిది రోజుల పాటు మద్యం, మాంసాహారం జోలికి పోకుండా నిష్టతో అమ్మవారిని కొలుస్తారు. కుటుంబంలో ఎవరైనా భవానీ మాత కంకణం కట్టుకుంటే ఆ ఇంటిల్లి పాదీ అమ్మవారి ప్రతిమను నిమజ్జనం చేసే వరకూ నియమాలు పాటిస్తారు. చివరి రోజైన ఆదివారం అమ్మవారు రాజరాజేశ్వరీ దేవి [illegible] జైత్రయాత్ర నిర్వహించారు. అనంతరం జలాశయాల్లో నిమజ్జనం చేయడంతో దీక్షలు విరమించారు.

కుక్కకాటుతో చిన్నారికి తీవ్రగాయాలు



కుక్క దాడిలో తీవ్రంగా గాయపడిన మల్లిక

కంగ్టి, అక్టోబరు 13: పండుగ రోజు సరదాగా ఇంటి ఎదుట ఆడుకుంటున్న నాలుగేళ్ల చిన్నారిపై కుక్క దాడిచేసి తీవ్రంగా గాయపర్చింది. మండల పరిధిలోని చాప్టా-కె గ్రామానికి చెందిన మల్లిక (4) శనివారం ఇంటి ఎదుట ఆడుకుంటుండగా ఒక్కసారిగా కుక్క దాడి చేసి ఆమె మొఖాన్ని కొరికేసింది. చిన్నారి రోదనలకు కుటుంబ సభ్యులు అప్రమత్తమై కుక్కను తరిమికొట్టారు. కుక్క దాడిలో చిన్నారి చెంప చీరుకుపోయింది. తీవ్రగాయాలైన చిన్నారని కంగ్టి వైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు. కాగా, గ్రామంలో గతంలోనే కుక్క కాటుకు నలుగురు గాయపడ్డారు.

పోటాపోటీగా అలయ్‌బలయ్

- తాడ్దాన్‌పల్లి చౌరస్తాలో మంత్రి దామోదర్
- అందోలులో మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ నిర్వహణ

7

ఉపాధి ప్రణాళికలు షురూ..!



- రానున్న ఆర్థిక సంవత్సరానికి గ్రామసభల ద్వారా ప్రణాళికలు
- నెలాఖరు వరకు గ్రామసభలు నిర్వహించనున్న అధికారులు

7

'జీజీహెచ్' భద్రమేనా?



సంగారెడ్డిలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రం

- పసికందు కిడ్నాప్‌తో కలకలం
- నాలుగేళ్ల క్రితం ఒకటి, తాజాగా మరొకటి..
- ఎవరోస్తున్నారో.. ఎవరు వెళ్తున్నారో తెలియని గందరగోళం
- ఇక సెల్‌ఫోన్ల చోరీ నిత్యకృత్యం
- కొరవడిన నిఘా.. సందర్శకుల రాకపై లేని నియంత్రణ

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 13 : సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి పరిధిలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లో నవజాత శిశువు కిడ్నాప్ కలకలం రేపింది. ఈ నెల 9న ఒకరోజు వయసున్న పసికందును కొందరు కిడ్నాప్ చేయగా.. పోలీసులు మరుసటి రోజు హైదరాబాద్‌లోని బోరబండలో కిడ్నాపర్లను పట్టుకుని పాపను కన్నవారికి అప్పగించారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. నాలుగేళ్ల క్రితం కూడా ఎంసీహెచ్ ఎస్ఎన్‌సీయూ నుంచి నవజాత శిశువు అపహరణకు గురైంది. మూడు రోజులు గాలించిన పోలీసులు ఎట్టకేలకు కామారెడ్డిలో పసికందును కనుగొని కుటుంబసభ్యుల చెంతకు చేర్చారు. తాజా ఘటనతో ప్రసవానికి వచ్చిన గర్భిణుల కుటుంబసభ్యులతో పాటు... ఆస్పత్రి అధికారులు, వైద్య సిబ్బందిలోనూ ఆందోళన వ్యక్తమవుతున్నది.

నిఘా అంతంతే..

మెడికల్ కాలేజీ ఏర్పాటుతో జనరల్ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసిన అనంతరం ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం 30 సీసీకెమెరాలను ఏర్పాటు చేశారు. 35 ఎకరాల ప్రాంగణంలో... 20 ఎకరాల్లో మెడికల్ కాలేజీ నిర్మిస్తున్నారు. మిగిలిన 15 ఏకరాల్లో ఆస్పత్రి భవనాలున్నాయి. ఇంత విశాల ప్రాంగణంలో నిఘా కోసం ఈ కెమెరాలు ఏమాత్రం సరిపోవడం లేదు. కొన్ని చోట్ల ఉన్న కెమెరాలు కూడా పనిచేయడం లేదు. ఇటీవల పసికందును ఎత్తుకెళ్లిన మార్గంలోనూ సీసీకెమెరా పనిచేయలేదు. ఎంసీహెచ్‌తో పాటు జీజీహెచ్‌లో పలు ప్రధాన ప్రాంతాల్లోనూ మరిన్ని సీసీ కెమెరాల ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. ఆస్పత్రి ప్రధాన గేటు వద్ద, ఆపరేషన్ థియేటర్ పక్కన కారిడార్‌లో, పార్కింగ్ ప్లేస్‌లో, ఐసీయూ ఇన్-ఔట్ మార్గాల్లో మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నది.


సెక్యూరిటీ సిబ్బంది వైఫల్యం

ఆస్పత్రిలో నిత్యం సుమారు 30 వరకు ప్రసవాలు జరుగుతుండగా, 1700 మంది ఔట్ పేషెంట్ ద్వారా వైద్య సేవలు పొందుతుంటారు. ఇంత రద్దీగా ఉండే జీజీహెచ్-ఎంసీహెచ్‌లో సెక్యూరిటీ సిబ్బంది నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదులు తరచుగా వస్తున్నాయి. ఆస్పత్రి ప్రాంగణంలో సెల్‌ఫోన్లు, సామగ్రి, బైకులు చోరీకి గురైనట్టు ఫిర్యాదులు వస్తున్నా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇటీవల శిశువు అపహరణలోనూ ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యంపై విమర్శలు వచ్చాయి. అనుమానాస్పదంగా ఎవరు కనిపించినా పట్టుకొని ఆరా తీయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. తాజాగా జరిగిన కిడ్నాప్ వ్యవహారంలో ఎంసీహెచ్ ఓటీ, లిఫ్ట్ వద్ద ఇద్దరు మహిళలు మాస్కులు ధరించి గంటల తరబడి ఎంఐసీయూ లోపలికి, బయటికి తిరిగినా వారి కదలికలను సెక్యూరిటీ సిబ్బంది గుర్తించకపోయారు. మరోవైపు హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు ప్రధాన సర్కారు ఆస్పత్రుల్లో సందర్శకులకు పాసులు జారీచేసే విధానం అమలులో ఉన్నది. కానీ ఇక్కడ ఆ విధానం లేకపోవడంతో ఎవరొస్తున్నారో.. ఎవరెళ్తున్నారో తెలియని పరిస్థితి నెలకొన్నది.

వైద్యంతోపాటు భద్రతకూ ప్రాధాన్యం

ఆస్పత్రిలో పసికందు కిడ్నాప్ ఘటన దురదృష్టకరం. ఆస్పత్రికి పేషెంట్లు, బంధువుల తాకిడి పెరగడంతో సెక్యూరిటీ సిబ్బందికి సవాలుగా మారింది. ఆస్పత్రిలోని అన్ని ఏరియాలను కవర్ చేసేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఇటీవల జరిగిన ఘటనతో మరిన్ని కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. పాసుంటేనే లోనికి అనుమతించే విధానాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం.

- అనీల్‌కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్



ఎంసీహెచ్‌లో ఇటీవల పసికందును ఎత్తుకెళ్లిన మార్గం

ఆగిన కారును ఢీకొట్టిన బైక్

● ముగ్గురికి గాయాలు

● రామాయంపేట బైపాస్‌లో ఘటన

రామాయంపేట, అక్టోబరు 13: రామాయంపేట బైపాస్‌లో సీతాఫలాల కోసం నిలిపిన కారును బైకర్ వేగంగా ఢీకొని మరో రెండు బైకులను ఢీకొట్టాడు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం హైదరాబాద్ రూట్లో జరిగింది. నిజాంపేట మండలం నస్కల్‌కు చెందిన ఓ యువకుడు దసరా పండుగకు ఇంటికి వచ్చి హైదరాబాద్ తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో ఇక్కడి అయ్యప్ప ఆలయం సమీపంలో ఓ కారు సీతాఫలాల కొనుగోలు కోసం నిలిపారు. అతివేగంతో గమనించని సదరు యువకుడు బండిని వేగంగా పోనిచ్చి అదుపుతప్పి కారుని ఢీకొట్టగా టైర్ పంచర్ అయింది. తదుపరి ముందర ఉన్న మరో రెండు బైకులను ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ మేరకు పోలీసులు చేరుకొని బాధితుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

స్నానానికి వెళ్లి వ్యక్తి మృతి

● సింగూరు ప్రాజెక్టు వద్ద ఘటన

● మూడురోజుల తర్వాత మృతదేహం లభ్యం



సంగెంగొల్ల విఠల్ (ఫైల్)

పుల్‌కల్, అక్టోబరు 13: సింగూరు ప్రాజెక్టుకు దిగువన మంజీర నదిలో స్నానానికి దిగిన ఓ వ్యక్తి గల్లంతై, మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పుల్కల్ ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ వివరాల ప్రకారం.. మండలంలోని సింగూరు గ్రామానికి చెందిన సంగెం గొల్ల విఠల్(38) ఈ నెల 11న కూలీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి టిఫిన్ బాక్సు వెంట పెట్టుకుని వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో సింగూరు ప్రాజెక్టుకు దిగువన స్నానం చేసేందుకు నదిలోకి దిగారు. అప్పటికే ఎగువ నుంచి వరద నీటి ప్రవాహం ఉండటంతో ప్రాజెక్టు ఒక క్రస్ట్ గేట్‌తో పాటు రెండు పవర్ జనరేషన్ గేట్లు కూడా ఎత్తారు. ఆ నీటి ప్రవాహానికి నీటిలో మునిగి గల్లంతవ్వగా, రెండురోజులుగా విఠల్ ఆచూకీ కోసం వెతికారు. ఆదివారం ప్రాజెక్టుకు దిగువన 11వ నంబరు క్రస్ట్ గేట్ స్పిల్‌వే వద్ద మృతదేహం నీటిపై తేలుతూ కనిపించింది. వరద నీటిని దిగువకు వదిలేందుకు ఓ వైపు క్రస్ట్ గేటు, మరోవైపు రెండు జల విద్యుత్ ఉత్పత్తి గేట్లు ఎత్తడంతో ఆ నీటి సుడులకు విఠల్ గల్లంతై, మూడురోజుల తర్వాత మృతదేహం లభ్యమైంది. కాగా మృతుడికి భార్య మంజుల, ఇద్దరు కుమారులున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి శవమై..

నర్సాపూర్, అక్టోబరు 13: అదృశ్యమైన వ్యక్తి శవమై తేలాడు. పోలీసుల వివరాల ప్రకారం.. నర్సాపూర్ పట్టణానికి చెందిన ఒంటెద్దు మోహన్(30) ప్లాస్టిక్ వస్తువులు సేకరించి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 10న వెళ్లిన వ్యక్తి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అదృశ్యం కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా శనివారం నర్సాపూర్ సమీపంలోని పందివాగు వద్ద ఓ గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించగా.. మృతుడు అదృశ్యమైన వ్యక్తిగా నిర్ధారించారు. మృతుడి భార్య సంగీత ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్యం బాగాలేక యువకుడి ఆత్మహత్య



అనిల్(ఫైల్)

మనోహరాబాద్, అక్టోబరు 13: ఆరోగ్యం బాగాలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ సుభాష్ గౌడ్ వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామానికి చెందిన వీరబోయిన భాస్కర్‌కు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నది. చిన్న కుమారుడు అనిల్(28)కు కిడ్నీ బాగాలేక ఇబ్బంది పడుతున్నాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు వెంటనే మేడ్చల్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిద్రలో వ్యక్తి మృతి



బాలయ్య(ఫైల్)

మనోహరాబాద్, అక్టోబర్ 13: నిద్రలోనే ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మనోహరాబాద్ మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండల కేంద్రానికి చెందిన అర్కల బాలేష్(50) అత్తగారి ఊరైన కోనాయపల్లికి వచ్చాడు. శనివారం రాత్రి ఇంట్లో నిద్రపోయాడు. ఉదయం ఎంతకీ లేవకపోవడంతో అత్త వెంటనే తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించింది. అక్కడ పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. మృతుడి తమ్ముడు పోచాలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



చిట్కుల్ విజయదశమి వేడుకల్లో నీలం మధు, నరేందర్‌రెడ్డి తదితరులు



జిన్నారం దుర్గమ్మ ఆలయం వద్ద దసరా ఉత్సవాలకు తరలివచ్చిన స్థానికులు

ఘనంగా విజయదశమి

● వేడుకల్లో సందడి చేసిన బిత్తిరి సత్తి, మంగ్లీ, ఇంద్రావతి

పటాన్‌చెరు, అక్టోబరు 13: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో దసరా వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పెద్ద చెరువు కట్టపై మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి నేతృత్వంలో ఏర్పాటుచేసిన రావణాసుర దహన కార్యక్రమానికి ఆయా కాలనీల ప్రజలు పెద్దఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రముఖ హాస్య వ్యాఖ్యాత బిత్తిరి సత్తి ఆహుతులను ఆహ్లాద పరిచేలా హాస్యాన్ని పండించారు. ప్రముఖ గాయకులు మంగ్లీ, ఇంద్రావతి నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. .

బీరంగూడలో..

బీరంగూడ మల్లికార్జునస్వామి ఆలయగుట్టపై మున్సిపల్ వైస్ చైర్మన్ నందారంనర్సింహగౌడ్, 14వ వార్డు కౌన్సిలర్ కవితాశ్రీనివాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో దసరా నిర్వహించారు. ప్రముఖ గాయని మధుప్రియ పాటలు ఆకట్టుకున్నాయి. పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.



బీరంగూడగుట్టపై దసరా వేడుకల్లో పాట పాడుతున్న మధుప్రియ

పటాన్‌చెరులో..

పటాన్‌చెరు రూరల్, అక్టోబరు 13: మండల పరిధిలోని విజయదశమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. చిట్కుల్‌లో జరిగిన ఉత్సవాల్లో కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు నరేందర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధు మాట్లాడుతూ నవరాత్రుల్లో భాగంగా దుర్గామాతను భక్తిశ్రద్ధలతో పూజించి పదోరోజు విజయానికి సంకేతంగా దసరా పండుగ జరుపుకుంటామన్నారు. బీఆర్ఎస్ నాయకులు, మాజీ జడ్పీటీసీ గడీల శ్రీకాంత్‌గౌడ్, మాజీ సర్పంచ్ లక్ష్మణ్, పాశమైలారం మాజీ సర్పంచ్ సుధాకర్‌గౌడ్ విజయదశమి వేడుకలు నిర్వహించారు.



పటాన్‌చెరు: వేడుకల్లో మంగ్లీ, ఇంద్రావతి

పోటాపోటీగా అలయ్‌బలయ్

● అందోలులో మాజీ ఎమ్మెల్యే

● తాడ్దాన్‌పల్లి చౌరస్తాలో మంత్రి దామోదర్

జోగిపేట, అక్టోబరు 13: దసరా పండుగ సందర్భంగా ప్రజలంతా బంగారం (శమీ పత్రం) ఇచ్చిపుచ్చుకుని ఒకరినొకరు ఆలింగనం (అలయ్‌బలయ్) చేసుకుంటూ శుభాకాంక్షలు తెలియజేసుకోవడం ఆనవాయితీ. అయితే ఈసారి అందోలు నియోజకవర్గంలో దసరా అనంతరం నిర్వహించే అలయ్‌బలయ్ కార్యక్రమాలు పోటాపోటీగా జరుగనున్నాయి. మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్... ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచీ తన సొంత మండలమైన వట్‌పల్లిలో ప్రతియేటా దసరా మరునాడు ప్రజలు, కార్యకర్తలను కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజెప్పేందుకుగానూ అలయ్‌బలయ్ పేరిట కార్యక్రమాన్ని ఏర్పాటు చేసేవారు. ఐదేళ్లుగా జరుపుతున్న ఈ వేడుకను ఈసారి కూడా నిర్వహిస్తున్నారు. గతంలో వట్‌పల్లిలో నిర్వహించే కార్యక్రమాన్ని జోగిపేట పట్టణానికి మార్చారు. సోమవారం మధ్యాహ్నం అందోలులోని లక్ష్మీనర్సింహ గార్డెన్స్‌లో క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో అలయ్‌బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు బీఆర్ఎస్ వర్గాలు పేర్కొన్నాయి.

తాడ్దాన్‌పల్లి చౌరస్తాలో మంత్రి దామోదర్

రాష్ట్ర మంత్రి దామోదర్ కూడా ఈయేడు అలయ్‌బలయ్ నిర్వహిస్తున్నారు. 35 ఏళ్లుగా దామోదర్ ఏనాడూ ప్రత్యేకంగా అలయ్‌బలయ్ కార్యక్రమాన్ని చేపట్టలేదు. కాకపోతే ప్రతీయేటా దసరా తరువాతి రోజో లేదా మరుసటి రోజో హైదరాబాద్‌లోనో, లేకుంటే, సంగారెడ్డిలోని తన నివాసంలోనో కార్యకర్తలను, నాయకులను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేసే కార్యక్రమాన్ని చేపట్టేవారు. ఈసారి ప్రత్యేకంగా అలయ్ బలయ్ కార్యక్రమాన్ని చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. చౌటకూర్ మండలం తాడ్దాన్‌పల్లి చౌరస్తా (సింగూరు చౌరస్తా)లోని ఎంఎస్ ఫంక్షన్‌హాల్లో ఈ వేడుకలను జరిపేందుకు నిర్ణయించినట్టు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

నేడు మంత్రి దామోదర రాజనరసింహ అలయ్ బలయ్

పుల్‌కల్, అక్టోబరు 13: విజయదశమి (దసరా) పండుగను పురస్కరించుకుని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సీ.దామోదర రాజనరసింహ చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో గల ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో నేడు అలయ్‌బలయ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 5 వరకు కార్యక్రమం కొనసాగుతుందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నత్తి దశరథ్ తెలిపారు.

రుణమాఫీ చేసిన రైతులందరికీ తిరిగి రుణాలు ఇవ్వాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు



సమావేశంలో మాట్లాడుతున్న చుక్క రాములు

సిద్దిపేట అర్బన్, అక్టోబరు 13: రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేసిన రైతులందరికీ తిరిగి రుణాలు ఇవ్వాలని, రుణాలు అందించడంలో జాప్యం సరైంది కాదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు అన్నారు. ఆదివారం సిద్దిపేటలో ఏర్పాటు చసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా పేరుతో ప్రతీ ఎకరానికి రూ.15 వేలు ఇస్తానని చెప్పి నేటికీ ఇవ్వకపోవడం సరైంది కాదన్నారు. రైతుభరోసా పథకాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదినెలలు పూర్తయినా రైతులకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలుచేయలేదన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ రైతులందరికీ చేయకుండా కొందరికే చేసి మోసం చేసిందన్నారు. ఇప్పటికైనా రైతులను ఆదుకోవాలని, లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో రైతులను సమీకరించి పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, గోపాలస్వామి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్, సందబోయిన ఎల్లయ్య, శెట్టిపల్లి సత్తిరెడ్డి, గొడ్డుబర్ల భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కృష్ణారెడ్డి, కొంగర వెంకట్ మావో, చొప్పరి రవికుమార్, తిప్పారపు శ్రీనివాస్, అత్తిరి శారద, సింగిరెడ్డి నవీన, జాలిగపు శిరీష, తాడూరి రవీందర్, దాసరి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సన్నాలకు రంగుమారుతున్న గొలుసు

● ఆందోళనలో సాగు రైతులు



గొలుసు రంగుమారుతున్న సన్నరకం

మద్దూరు, అక్టోబరు 13: సన్న రకం వడ్లు సాగుచేసిన రైతులకు పక్షం రోజుల్లో పంట చేతికందే సమయంలో గింజ నలుపు రంగులోకి మారి గింజ తాలు పోతుండటంతో ఆందోళన చెందుతున్నారు. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలోని రైతులు ప్రభుత్వ సూచన ప్రకారం ఈసారి దొడ్డు రకంతో పాటు సన్నాలను ఎక్కువగా సాగుచేశారు. ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500ల చొప్పున బోనస్ ప్రకటించడం ఉత్తేజాన్ని ఇచ్చినా.. గింజ రంగు మారి తాలు పోతుండడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. మండలంలో 9,660 మంది రైతులు సుమారు రూ.1,650 ఎకరాలకు పైగానే సన్నాలు సాగుచేసినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. గొలుసుకున్న గింజ నలుపు రంగులోకి మారి తాలు పోతుండటంతో పెట్టుబడులు వస్తాయో రావోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గొలుసు రంగు మారుతోంది

మూడెకరాల్లో సన్న రకానికి చెందిన ఆమని సాగు చేపట్టాను. పదిహేను రోజుల్లో పంట చేతి కందనున్న సమయంలో గొలుసుకు గింజ నలుపు రంగుమారి తాలు పోతోంది. ఎకరాకు రూ.20 వేలు ఖర్చు చేశాను. ఎకరాకు సుమారు 10 బస్తాలు దిగుబడి వచ్చే పరిస్థితి లేకుండాపోతోంది. వ్యవసాయాధికారులు సందర్శించి పంట రంగుమారకుండా ఏయే మందులు వాడాలో సలహాలు అందించాలి.

- మేక మల్లేశం గాగిల్లాపూర్ గ్రామ రైతు

ఆధ్యాత్మిక చైతన్యం పొందాలి: మాధవానంద స్వామి

మెదక్ అర్బన్, అక్టోబరు 13: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చైతన్యం పొందాలని, ప్రపంచంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని మాధవానంద సరస్వతీస్వామి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ సంఘ భవన స్థలంలో నూతనంగా నిర్మించిన షెడ్డును ప్రారంభించారు. అనంతరం అనుగ్రహ భాషణం చేస్తూ.. బ్రాహ్మణులు ప్రపంచ శాంతి కోసం పాటు పడుతూ.. ప్రజలను ఆధ్యాత్మికంగా చైతన్యవంతం చేయాలన్నారు. సంఘం ఆధ్వర్యంలో ప్రజా ఉపయోగ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణులు సామూహికంగా రుద్రపారాయణం, సూక్త పారాయణాలు పఠించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం మెదక్ డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి శర్మ, వైద్యశ్రీనివాస్‌శర్మ, బాధ్యులు, బ్రాహ్మణులు సాయిబాబా, పండిత్‌రావు, కృష్ణమూర్తి, మధుసూదనచార్యులు, నరేందర్‌బాబు పాల్గొన్నారు.



అనుగ్రహ భాషణం చేస్తున్న మాధవానంద సరస్వతీస్వామి

ఉపాధి ప్రణాళికలు షురూ..!

● రానున్న ఆర్థిక సంవత్సరానికి గ్రామసభల ద్వారా ప్రణాళికలు

● నెలాఖరు వరకు గ్రామసభలు నిర్వహించనున్న అధికారులు

● 100 రోజుల పని దినాలు కల్పించడమే లక్ష్యం

● భూగర్భ జలాల పెంపు పనులకే ప్రాధాన్యం

సిద్దిపేట కలెక్టరేట్, అక్టోబరు 13: ఉపాధిహామీ పథకం గ్రామీణ కూలీలకు కొన్నేళ్లుగా చేతినిండా పని కలిస్తున్నది. ఈ మేరకు అధికార యంత్రాంగం ప్రతీ ఏటా నూతన పనుల గుర్తింపు ప్రక్రియ చేపట్టి పరిపాలన ఆమోదానికి ప్రతిపాదనలు పంపాల్సి ఉంటుంది. ముఖ్యంగా వలసల నివారణకు గ్రామాల్లోనే పని కల్పించేందుకు అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఉపాధి కూలీలకు గరిష్ఠంగా రూ. 100 వరకు కూలి చెల్లిస్తూ నిరుపేదలకు బాసటగా నిలుస్తున్నది.

భూగర్భ జలాల పెంపు పనులకే ప్రాధాన్యం

ఈ పథకం ద్వారా గతంలో సెగ్రిగేషన్ షెడ్లు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతివనాలు, నర్సరీలు, వనమహోత్సవం, పల్లె క్రీడా మైదానాలు వంటి పనులు, చెరువులు, కుంటల్లో పూడికతీత పనులు, వ్యవసాయ బావులకు రహదారి నిర్మాణాలు, కట్ట కాల్వల పనులను చేపట్టారు. ఈసారి భూగర్భజలాలు పెంచేలా నీటి నిల్వ గుంతలు, పంట కాల్వలు, మట్టిదారులు, కందకాల తవ్వకాలు, పశువుల పాకల నిర్మాణాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లుగా సంబంధితశాఖల అధికారులు చెబుతున్నారు. పథకంలో భాగస్వాములైన కూలీలందరికీ ఆర్థిక సంవత్సరంలో వంద రోజుల పని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. ఇందుకు పనులు గుర్తించడంతో పాటు ప్రజల అంగీకారం తప్పనిసరికావడంతో ఇప్పటి నుంచే ప్రక్రియ ప్రారంభించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. పనులకయ్యే ఖర్చు వివరాలు తయారుచేసి పంపించాల్సి ఉంటుంది. ఆ వెంటనే తీర్మానాలను ఉపాధిహామీ వెబ్‌సైట్‌లో పొందుపరిచి అనుమతి తీసుకోవాలి.



నంగునూర్ మండలం మగ్దుంపూర్ గ్రామంలో ఉపాధి పనులపై గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

ప్రజల అభిప్రాయాల మేరకే

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వచ్చే ఏడాది మార్చితో ముగియనున్న నేపథ్యంలో వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనులను ఇప్పటి నుంచే గుర్తించనున్నారు. జిల్లాల్లో 499 గ్రామపంచాయతీలు ఉండగా ముంపు గ్రామాలుపోనూ.. 489 గ్రామ పంచాయతీల్లో ఈ నెలాఖరులోపు గ్రామసభలు పూర్తి చేసి, నవంబరులో మండలాల వారీగా ప్రణాళికలు తయారు చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తారు. జిల్లాలోని అన్ని గ్రామపంచాయితీల్లో సిద్ధం చేసిన నివేదికను తొలుత మండల పరిషత్, తర్వాత జడ్పీ ఆమోదం కోసం పంపిస్తారు. వాటిని రాష్ట్రస్థాయిలో ఆమోదానికి పంపాల్సి ఉంటుంది. పరిపాలన ఆమోదం లభించగానే గ్రామాల్లో పనులను చేపడతారు. జిల్లాలో 1,36,000 జాబ్‌కార్డులు ఉండగా.. అందులో 2.37 లక్షల మంది కూలీలు ఉపాధిహామీ పనులకు వెళ్తున్నారు. దాదాపు 42 లక్షల పని దినాలు కల్పించాడనికి అధికారుల ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈసారి భూగర్భ జల వనరుల అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం సూచించింది.

ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం



వచ్చే ఆర్థిక సంవత్సరానికి గ్రామాల్లో ఎలాంటి ఉపాధి పనులు చేపట్టాలనే దానిపై చర్చించి ప్రణాళికలు తయారు చేసేందుకు గ్రామసభలను నిర్వహిస్తున్నాం. ప్రతీ కూలీకి 100 రోజుల పని కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

- జయదేవ్ ఆర్య, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి

ఘనంగా దసరా వేడుకలు


పటాన్‌చెరు: మైత్రీ గ్రౌండ్‌లో పాలపిట్టను ఎగురవేసి దసరా వేడుకలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


ఖేడ్‌లో శమీపూజలో ఎంపీ సురేష్‌షెట్కార్


జహీరాబాద్: శివాలయం వద్ద జంబిచెట్టుకు పూజ చేస్తున్న ఎమ్మెల్యేమాణిక్‌రావు తదితరులు


రాయికోడ్: నాగ్వార్‌లో జమ్మి చెట్టుకు పూజలు నిర్వహిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య

న్యూస్‌నెట్‌వర్క్, అక్టోబరు 13:

దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం వేడుకలను సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఆయా గ్రామాల్లో ప్రజలు నూతన వస్త్రాలు ధరించి సీమోల్లంఘన కార్యక్రమంలో భాగంగా పాలపిట్టను దర్శించుకుని సందడి చేశారు. అనంతరం భాజాభజంత్రీలతో ఊరేగింపుగా గ్రామ శివార్లలో ఏర్పాటు చేసిన జంబి వృక్షాల వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు, ధ్వజారోహణం నిర్వహించారు. జంబి ఆకును బంగారంగా పరస్పరం ఇచ్చిపుచ్చుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలుచోట్ల రావణ దహనంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను అట్టహాసంగా నిర్వహించారు.

సంగారెడ్డి జిల్లాలో..

సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు మైత్రీ మైదానంలో రావణాసుర దహనం కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. జీహెచ్‌ఎంసీ కార్యాలయం వద్ద ధ్వజారోహణ నిర్వహించారు. మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ వద్ద నిర్వహించిన శమీ పూజలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్, పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో పెద్దచెరువు కట్టపై మున్సిపల్ చైర్మన్ తుమ్మలపాండురంగారెడ్డి నేతృత్వంలో రావణాసుర దహనం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సెలబ్రిటీ బిత్తిరిసత్తి ఆహూతులను ఆహ్లాద పరిచేలా హాస్యాన్ని పండించారు. ప్రముఖ గాయకులు మంగ్లీ, ఇంద్రావతి నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు. బీరంగూడా మల్లికార్జునస్వామి ఆలయ గుట్టపై మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నర్సింహగౌడ్, కౌన్సిలర్ ఏనుగు కవితశ్రీనివాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో దసరా వేడుకలతో పాటు, రావణదహనం కార్యక్రమాన్ని నిర్వహించారు. నారాయణఖేడ్‌లో ఎంపీ సురేష్ షెట్కార్ తన నివాస గృహం నుంచి భాజాభజంత్రీలతో తహసీల్ మైదానం వరకు ఖేడ్‌వాసులతో కలిసి చేరుకుని శమీ వృక్షానికి పూజలు నిర్వహించారు. మంగల్‌పేట శివారులో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి శమీ, జంబి చెట్లకు పూజలు చేశారు. అనంతరం ఖేడ్, మంగల్‌పేట ప్రజలు తహసీల్ మైదానానికి చేరుకుని రావణాసుర దహనం కార్యక్రమాన్ని తిలకించారు. సాయంత్రంనుంచి అర్ధరాత్రి వరకు సంగీత విభావరి కార్యక్రమం అందరినీ ఆకట్టుకున్నది. జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్‌కు స్థానిక ఎమ్మెల్యే పటోళ్ల సంజీవరెడ్డి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఖేడ్‌లో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, విజయ్‌పాల్‌రెడ్డి, గుర్రపు మశ్చందన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మశ్చందర్, పట్టణంలో అలయ్‌బలయ్‌లు నిర్వహించారు. జహీరాబాద్ డివిజన్‌వ్యాప్తంగ దసరాపండుగ ఉత్సవాలను శనివారం ప్రజలు ఉత్సాహభరితంగ జరుపుకున్నారు. జహీరాబాద్‌లోని శివాలయంవద్ద రావణసుర వధ కార్యక్రమం అందరినీ ఆకట్టుకున్నది. ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీమంత్రి చంద్రశేఖర్ ఉత్సవాల్లో పాల్గొన్నారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ.శివలింగం పట్టణ ఎస్‌ఐలు కాశీనాథ్‌లు, ప్రసాదరావులు కలిసి ఆయుధపూజను నిర్వహించారు. ఆదివారం పట్టణలోని ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయం వద్ద దసరామిలాప్ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్‌తో పాటు పలువురు పాల్గొని పండుగ శుభాకాంక్షలు చెప్పారు. సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మాజీమంత్రి చంద్రశేఖర్ తమ క్యాంపుకార్యాలయాల వద్ద అలయ్ బలయ్ నిర్వహించారు. కోహీర్ మండలంలోని ఆయా గ్రామాల్లో దసరా వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కోహీర్‌లో సార్వజనిక్ హిందు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దసరా వేడుకలతో పాటు రావణ దహనం కార్యక్రమాన్ని నిర్వహించారు. రాయికోడ్ మండల పరిధిలో నాగ్వార్ గ్రామంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి.అంజయ్య జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించారు. కల్హేర్ మండల పరిధిలోని ఖానాపూర్(కె)లో నిర్వహించిన జంబి పూజలో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యేలు ఎం. విజయపాల్‌రెడ్డి, ఎం. భూపాల్‌రెడ్డిలు పాల్గొని దసరా వేడుకలు జరుపుకున్నారు. అదేవిధంగా జోగిపేట, ఝరాసంగం, సిర్గాపూర్, మనూరు, నాగల్‌గిద్ద, పుల్‌కల్, జిన్నారం తదితర మండలాల్లోని గ్రామాల్లో ప్రజలు జమ్మిచెట్టుకు పూజలు నిర్వహించి బంధుమిత్రులకు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మెదక్ జిల్లాలో..

మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీసు కార్యాలయంలో ఆయుధ, వాహన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. విజయదశమి పండుగ జిల్లా ప్రజలకు అన్ని రంగాల్లో విజయం చేకూర్చాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, ఏఆర్ డీఎస్పీ రంగనాయక్, అల్లాదుర్గం సీఐ రేణుకరెడ్డి, ఆర్ఐ, ఏఆర్‌ఎస్‌ఐలు, తదితరులు పాల్గొన్నారు. నర్సాపూర్‌లో నిర్వహించిన వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, మాజీ చైర్మన్ మురళీధర్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్‌తో పాటు పుర ప్రముఖులు, కౌన్సిలర్లు పాల్గొని ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నర్సాపూర్ పట్టణంలోని ధర్మశాలలో హిందువాహిని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి వద్ద శనివారం సాయంత్రం రావణ దహనం కార్యక్రమం ఎంతో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ మురళిధర్‌యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్‌తో పాటు ఆర్‌ఎస్‌ఎస్, హిందువాహిని ప్రతినిధులు, కౌన్సిలర్లు, ఆయా పార్టీల నాయకులతో పాటు పట్టణ వాసులు పెద్ద ఎత్తున వచ్చి తిలకించారు. అల్లాదుర్గంలోని శిలాంకోట దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో రావణ దహనం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. శివ్వంపేట మండలం గోమారంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి గాంధీ విగ్రహానికి పూలమాల సమర్పించి జంబి పూజలో పాల్గొన్నారు. చిన్నశంకరంపేట, మనోహరాబాద్ మండలాల్లో, వెల్దుర్తిలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద వేడుకల్లో రావణాసుర దహనం కార్యక్రమాన్ని నిర్వహించారు. మాసాయిపేటలో నిర్వహించిన వేడుకల్లో కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు పాల్గొని ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తూప్రాన్ మండలంలో ఊరూరా జాతీయ పతాకాల ఆవిష్కరణ, జమ్మిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. తూప్రాన్ పట్టణ పరిధి బ్రాహ్మణపల్లి, అల్లాపూర్‌లలో నూతనంగా హైడ్రాలిక్ పద్ధతిలో జాతీయ జెండాలను ఎగురవేశారు. తూప్రాన్ పట్టణంలో చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణ ఆధ్వర్యంలో జమిపూజ నిర్వహించారు. రామాయంపేట, హవేళిఘణపూర్, రేగోడు, పెద్దశంకరంపేట, కొల్చారం, నిజాంపేట మండలాల్లో వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.


నర్సాపూర్: జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో జంబి చెట్టుకు పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్


మెదక్ ప్రధాన పోలీసు కార్యాలయంలో ఆయుధ పూజ నిర్వహిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి


మెదక్‌లోని జూనియర్ కళాశాల మైదానంలో శుభాకాంక్షలు తెలుపుకుంటున్న కౌన్సిలర్లు, నాయకులు


ఆకాశంలోకి దీపాల గాలి బుడగను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం


దుర్గామాతను దర్శించుకుంటున్న ఉపాధ్యాయ సంఘం నేతలు

పాపన్నపేట, అక్టోబరు 13: ఉపాధ్యాయ సమస్యలపై రాజీ లేని పోరాటం చేస్తామని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్ రెడ్డి, పుల్లం దామోదర్‌రెడ్డి పేర్కొన్నారు.. రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన అనంతరం తొలిసారిగా ఏడుపాయలకు వచ్చిన వారు దుర్గమ్మతల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ త్వరలో రాబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం టీచర్లు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. పీఆర్టీయూ అభ్యర్థులను గెలిపించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా పీఆర్టీయూ అధ్యక్షుడు నుంకరి క్రిష్ణ ఆధ్వర్యంలో రాష్ట్రశాఖను ఘనంగా సన్మానించారు. పత్రికా సంపాదకవర్గ సభ్యుడు వెంకట్ రాంరెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మల్లారెడ్డి, దుర్గయ్య, సాయిలు, రాజు, సురేష్, మెదక్, పాపన్నపేట, టేక్మాల్, మండలాల సభ్యులు, టీచర్లు పాల్గొన్నారు.

కొత్త ఉపాధ్యాయులకు సన్మానం


నూతనంగా నియామకమైన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈవో

వెల్దుర్తి, అక్టోబరు 13: ఎస్ఏ (ఇంగ్లీష్) ఉద్యోగం సాధించిన వెల్దుర్తి పట్టణానికి చెందిన ముల్క రవీందర్‌ను, కొల్చారం మండల కొంగోడుకు చెందిన దంపతులు స్వప్న, శేఖర్‌లు ఎస్జీటీలుగా నియామకం కావడంతో వారిని ఎంఈవో యాదగిరి, ఎస్జీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం, బంధువులు ఆదివారం ఉదయం ఘనంగా సన్మానించారు. అలాగే మానేపల్లి గ్రామానికి చెందిన రాఘవుల నరేందర్ రెడ్డి టీచర్ ఉదోగం సాధించడంతో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నరేందర్‌రెడ్డి గ్రామస్థులతో కలిసి ఘనంగా సన్మానించాడు.

రేగోడు నుంచి తుల్జాపూర్‌కు పాదయాత్ర

రేగోడు అక్టోబరు 13: రేగోడు నుంచి తుల్జాపూర్ భవానీమాత ఆలయానికి పాదయాత్రగా 36 మంది భక్తులు ఆదివారం బయలుదేరారు. ఏటా దసరా మరుసటి రోజు భవానీమాతను దర్శించుకునేందుకు పాదయాత్రగా వెళ్తున్నామని భక్తులు తెలిపారు. రేగోడు నుంచి మహారాష్ట్రలోని తుల్జాపూర్ భవానీమాత ఆలయం వరకు దాదాపు 220 కిలోమీటర్లు ఈ పాదయాత్ర చేస్తారు. పాదయాత్రను రేగోడు పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్యాంరావ్, రాధా కిషన్, రాజేందర్ పాటిల్, శివకుమార్ ప్రారంభించారు. మర్పల్లి వద్ద పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు కిరాణం దుకాణం యజమాని గున్న వెంకటేశం వాటర్ బాటిళ్లను అందజేశారు. ఈ నెల 17వ తేదీన తుల్జాపూర్ చేరుకొని పూజలు చేస్తామని వారు తెలిపారు.

క్రీడలతో స్నేహభావం


కొర్విపల్లిలో కబడ్డీ విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న నాయకులు

చిన్నశంకరంపేట, అక్టోబరు 13: క్రీడలతో స్నేహభావం కలుగుతుందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజు పేర్కొన్నారు. దసరా పండుగ సందర్భంగా చిన్నశంకరంపేట మండలంలోని కొర్విపల్లిలో జిల్లా క్రీడలను నిర్వహించారు. ఆదివారం కబడ్డీలో ఫైనల్ మ్యాచ్ గెలుపొందిన ధర్పల్లి క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజు, మాజీ సర్పంచ్ రాజీరెడ్డి, పద్మామల్లేశం, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర, కాంగ్రెస్ మండల యూత్ ప్రెసిడెంట్ రాజశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పుల్లారావు, ఆయా గ్రామాల క్రీడాకారులు పాల్గొన్నారు.

కనుల పండువగా.. దుర్గామాత నిమజ్జన శోభాయాత్ర


తూప్రాన్‌లో శ్రీదుర్గామాత నిమజ్జన శోభాయాత్ర


నర్సాపూర్: పెద్దచింతకుంటలో..


మెదక్‌లో శోభాయాత్రలో కోలాటం

న్యూస్‌నెట్‌వర్క్, అక్టోబరు 13:

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండపాల్లో నవరూపాల్లో పూజలందుకున్న దుర్గామాత ప్రతిమల నిమజ్జన శోభాయాత్రలు ఆదివారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి పాటలు, దాండియా, కోలాటాలతో శోభాయాత్రలు ఆద్యంతం అందరినీ ఆకట్టుకున్నాయి. భక్తులు, దీక్షాపరులు కాషాయధ్వజాలను చేతబూని అమ్మవారి నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్నారు.

మెదక్ పట్టణంలో దుర్గామాత నిమజ్జన శోభాయాత్ర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఊరేగింపులో భవానీ దీక్షాపరులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు కాషాయ ధ్వజాలను చేతబూని భజనలు, భక్తిపాటలు పాడుతూ చెరువులు, కాలువల్లో అమ్మవారి ప్రతిమలను నిమజ్జనం చేశారు. తూప్రాన్ పట్టణంలోని దేవీగార్డెన్‌లో శ్రీదుర్గామాత, శ్రీమహంకాళి ఆలయంలోని శ్రీనవదుర్గామాత ప్రతిమల నిమజ్జన శోభాయాత్ర ఘనంగా చేపట్టారు. శ్రీదుర్గామాత నిమజ్జన శోభాయాత్రను దేవీగార్డెన్ నుంచి పెద్దచెరువు వరకు నిర్వహించి నిజ్జనం చేశారు. శోభాయాత్రలో మహిళల కోలాటాలు, డోలు వాయిద్యాలు, కోలాటం, భక్తుల నృత్యాలమధ్య కొనసాగింది. శ్రీమహంకాళి ఆలయంలో శ్రీనవదుర్గామాత శోభాయాత్ర తహసీల్దారు కార్యాలయం మీదుగా పెద్దచెరువు వరకు నిర్వహించి నిమజ్జనం చేశారు. నర్సాపూర్ మండలం పెద్దచింతకుంటలో భవానీ మాత ప్రతిమను ఆదివారం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఊరేగింపుగా తీసుకెళ్లి స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. కొల్చారం మండలంలోని రాంపూర్ వరిగుంతం రంగంపేట పోతంశెట్టిపల్లి ఎనగండ్ల పైతర తో పాటు వివిధ గ్రామాల్లో దుర్గామాత నిమజ్జనోత్సవం వైభవంగా జరిగింది. రాంపూర్ గ్రామంలో అమ్మవారి వద్ద ఉన్న లడ్డూను వేలం వేయగా పోచయ్య అనే భక్తుడు రూ.51 వేలకు దక్కించుకున్నాడు. శివ్వంపేట మండలకేంద్రంతో పాటు దొంతి, పిల్లుట్ల, కొంతాన్ పల్లి గ్రామాల్లో అమ్మవారి శోభాయాత్ర ఆదివారం కనులపండుగ నిర్వహించారు. గోమారం గ్రామంలో ఎమ్మెల్యే సునీతా రెడ్డి నిమజ్జనం సందర్భంగా పూజలు నిర్వహించారు. అదేవిధంగా అల్లాదుర్గం, మనోహరాబాద్, వెల్దుర్తి, చిన్నశంకరంపేట, రేగోడు, సంగారెడ్డి జిల్లాలోని కల్హేర్, కంగ్టి మండలాల్లో అమ్మవారి ప్రతిమలను ఊరేగింపుగా తీసుకెళ్లి సమీపంలోని చెరువులు, కాలువల్లో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన శోభాయాత్రలు సందడిగా కొనసాగాయి.


శివ్వంపేట: గోమారంలో అమ్మవారి నిమజ్జనం ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే సునీతారెడ్డి


వెల్దుర్తి:అమ్మవారి ఊరేగింపులో భక్తులు


కల్హేర్‌లో నిమజ్జనానికి తరలుతున్న అమ్మవారు

ఆధ్యాత్మిక చైతన్యం పొందాలి


అనుగ్రహభాషణం చేస్తున్న మాధవానంద సరస్వతీ స్వామి

మెదక్ అర్బన్, అక్టోబరు 13: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చైతన్యం పొందాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని శ్రీ మాధవానంద సరస్వతీస్వామి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ సంఘం భవన స్థలంలో నూతనంగా నిర్మించిన షెడ్డును ఆయన ప్రారంభించారు. అనంతరం భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణం చేస్తూ.. బ్రాహ్మణులు ప్రపంచ శాంతి కోసం పాటుపడుతూ.. ప్రజలను ఆధ్యాత్మికంగా చైతన్యవంతం చేయాలన్నారు. సంఘం ఆధ్వర్యంలో ప్రజా ఉపయోగ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణులు సామూహికంగా రుద్రపారాయణం, శ్రీ సూక్త పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ డివిజన్ బ్రాహ్మణ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి లింగమూర్తిశర్మ, వైద్యశ్రీనివాస్‌శర్మ, బాధ్యులు, బ్రాహ్మణులు సాయిబాబా, పండిత్‌రావు, కృష్ణమూర్తి, మధుసూదనాచార్యులు, నరేందర్‌బాబు, ప్రసాద్‌శర్మ, రాజారామచంద్రరావు, సోమశేఖర్‌శర్మ, ఫణిశర్మ, జనార్దన్, రాజేష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

మహాయాగంలో మెదక్ ఎమ్మెల్యే


హోమంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

రామాయంపేట, అక్టోబరు 13: పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చెప్పెట ముత్యంరెడ్డి నిర్వహించిన మహాయాగం, హోమంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు హాజరయ్యారు. ఆదివారం ప్రత్యంగిరాదేవి అభిషేకంతో పాటు కాలభైరవ హోమాన్ని దేవీ ఉపాసకుడు బ్రహ్మ శ్రీ సుధీర్ శర్మ నిర్వహణలో సాగింది. ఈ మేరకు హాజరైన ఎమ్మెల్యే వేద పండితుల ఆశీర్వచనం తీసుకొని మాట్లాడారు. ఇలాంటి దైవ కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరమన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఆయన వెంట ఏఎస్పీ నరసింహారెడ్డితో పాటు టీపీసీసీ కార్యదర్శి సుప్రభాతారావు, కౌన్సిలర్లు దేమే యాదగిరి, చిలుక గంగాధర్, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పాలుపంచుకున్నారు.

ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు


శతాబ్ది ఉత్సవాల్లో ఆర్‌ఎస్‌ఎస్ గీతాన్ని ఆలపిస్తున్న కార్యకర్తలు

రాయికోడ్, అక్టోబరు 13: మండల కేంద్రమైన రాయికోడ్‌లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శత వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకుడు డాక్టర్ కేశవ్ బలిరామ్‌పంత్ హెడ్గేవార్, భరతమాత, గురూజీ, దుర్గాదేవి అమ్మవారి చిత్రపటాలకు, పలు ఆయుధాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించి, ఆర్‌ఎస్‌ఎస్ గీతాన్ని ఆలపించారు. ముఖ్యవక్తగా విచ్చేసిన సంఘ్‌ప్రచారక్ శ్రీరామ్ ప్రసాద్ మాట్లాడుతూ.. ఆర్‌ఎస్‌ఎస్ అంటే మిగతా మతాలను కించపరచకుండా తన ధర్మాన్ని, సంస్కృతిని కాపాడుతూ స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు.

ప్రొ. సాయిబాబా మరణం హక్కుల ఉద్యమానికి తీరనిలోటు

మెదక్ అర్బన్, అక్టోబరు 13: రాజ్యాధికారంపై ధిక్కార స్వరం ప్రొఫెసర్ సాయిబాబాది అని మానవ హక్కుల వేదిక నేత షేక్ అహ్మద్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భీమాకోరేగాం కుట్ర కేసును అన్యాయంగా బనాయించి, అందులో సాయిబాబా పేరును నమోదు చేసి తొమ్మిదేళ్లపాటు జైలులో నిర్బంధించారని ఆరోపించారు. చివరికి ఆయన నిర్దోషిగా బయటకు వచ్చారని, ఆ తొమ్మిదేళ్లపాటు తీవ్ర అనారోగ్యానికి గురైన ఆయన హఠాన్మరణం చెందడం ప్రభుత్వ దమన నీతికి నిదర్శమన్నారు. దీనిని ప్రభుత్వం చేసిన హత్యగా ఆయన అభివర్ణించారు. ప్రజా ఉద్యమాల్లో తనదైన భూమిక పోషించారని గుర్తు చేశారు. ఆయన మరణం హక్కుల ఉద్యమానికి తీరనిలోటన్నారు.

అంధకారంలోనే పండుగ

● అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం


డాకూరు 7వ వార్డులో అలుముకున్న చీకటి, కాలిపోయిన కంట్రోల్ స్విచ్

జోగిపేట, అక్టోబరు 13: అందోలు-జోగిపేట మున్సిపాలిటీ సహా మండలంలోని అన్ని గ్రామాల్లోనూ దసరా పండుగను ఘనంగా జరుపుకున్నారు. అయితే మండలంలోని పలు గ్రామాల్లో వీధి లైట్లు వెలగకపోవడంతో పండుగ రోజు కూడా అంధకారం నెలకొందని ప్రజలు మండిపడ్డారు. పాలకవర్గాలు లేకపోవడంతో ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు పట్టించుకోకపోవడంతో పండుగ పూట ప్రజలు ఇబ్బందిపడ్డారు. మండలంలోనే పెద్ద గ్రామమైన డాకూరులోని పలు వీధుల్లో లైట్లు వెలగకపోవడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకరోజు ముందు నుంచే పంచాయతీ సిబ్బందిని అప్రమత్తం చేసినా పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గతంలో పండుగపూట గొడవలు జరిగిన చరిత్ర ఉన్న గ్రామంలో చీకటి నెలకొనడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. 7వ వార్డు ప్రజలు పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేయడానికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎత్తలేదని మండిపడ్డారు. పంచాయతీ సిబ్బంది కనీసం పట్టించుకోలేదని, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా మరునాడు బాగు చేయిస్తామని సమాధానమిచ్చినట్టు వార్డు ప్రజలు వాపోయారు. పంచాయతీ సిబ్బందిపై ఆదివారం ఉదయం వార్డుకు చేరుకుని 'ఉన్నతాధికారులకు మాపై ఫిర్యాదు చేస్తారా.. మీ వీధిలో ఎప్పటికీ లైట్లు వేయం.. దిక్కున్నచోట చెప్పుకోండి' అంటూ దురుసుగా మాట్లాడారని వార్డు ప్రజలు వాపోయారు.

రాష్ట్ర స్థాయి ఎస్జీఎఫ్ క్రీడలకు నలుగురు గురుకుల విద్యార్థులు

జిన్నారం, అక్టోబరు 13: రాష్ట్ర స్థాయి అండర్ 14 ఎస్జీఎఫ్ క్రీడలకు జిన్నారం ఎస్టీ గురుకుల పాఠశాల క్రికెట్ అకాడమీకి చెందిన 4 విద్యార్థులు ఎంపికయ్యారు. గురుకుల పాఠశాలలో క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందిన పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఈ నెల 14నుంచి 16 వరకు జోగులాంబ జిల్లాలో నిర్వహించే క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వెంకటనారాయణ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు కార్తీక్, రవీంద్రనాథ్, ధన్వంతరి కార్తిక్, రాథోడ్ ధనూష్ ఎంపిక కాగా ఇందులో ముగ్గురు ఉమ్మడి మెదక్, మరో విద్యార్థి ఆదిలాబాద్ జట్టుకు ఎంపికయ్యారు.

అస్వస్థతకు గురైన వారికి మెరుగైన చికిత్స అందించాలి


ఖేడ్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, అక్టోబరు 13: నారాయణఖేడ్ మండల పరిధిలోని సంజీవన్‌రావుపేటలో కలుషితమైన నీటిని సరఫరా చేయడంవల్లే అనేకమంది అస్వస్థతకుగురయ్యారని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం సాయంత్రం సంజీవన్‌రావుపేట గ్రామాన్నిసందర్శించిన అనంతరం నారాయణఖేడ్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. నీటిని సక్రమంగా సరఫరా చేయకపోవడం వల పండగ రోజు గ్రామస్థులు వైద్యశాల చుట్టు తిరిగాల్సిన పరిస్థితిఏర్పడిందన్నారు. సంజీవన్‌రావుపేట గ్రామానికి చెందిన అస్వస్థతకుగురైన వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని, బాధిత కుటుంబీకులతో పాటు మృతుల కుటుంబీకులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట మండలపార్టీ అధ్యక్షుడు పరమేశ్వర్, మాజీ సర్పంచు నజీబ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు నగేష్, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షులుసాయిరెడ్డి, సంజీవన్‌రావుపేట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

అధికారుల నిర్లక్ష్యం వల్లే అస్వస్థత: సీపీఎం

మండలపరిధిలోని సంజీవన్‌రావుపేటలో కలుషితమైన తాగునీరు అందించడం వల్లే గ్రామానికి చెందిన అనేక మంది అస్వస్థతకు గురయ్యారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు మాణిక్ పేర్కొన్నారు. గ్రామస్థులకు మెరుగైన వైద్యసేవలు అందించడమే కాకుండా నీటిని సక్రమంగా సరఫరా చేయాలన్నారు.